# ప్రకరణ భంగం

శర్మ సంస్కృతం చదువుకున్న మహాపండితుడని ఇదివరకే చెప్పాను. మహామహులైన విద్వద్గురుచరణ సన్నిధానంలో శాస్త్రపఠనం చేశాడు. రసవత్కవితా కళానిధి. శృంగార రసమును గురించి క్షుణ్ణంగా చదివి దాని నిజతత్త్వమును జీర్ణింపజేసుకున్నాడు.

ఇటువంటి విద్వాంసుడు స్వకీయమైన జానకీ సాన్నిధ్యంలో అశాస్త్రీయంగా ప్రవర్తిస్తూ ఉన్నాడూ అంటే, పండితులూ కవులూ సహించలేకుండా ఉన్నారు.

శర్మ ఎల్లాంటివాడు?

కాంతా హృదయ స్వభావాన్ని గురించి సంస్కృత సాహిత్యంలో ఉపలబ్ధమయ్యే సాహిత్య సంపదను 'అంతా చూరగొన్న సరసుడు.

శృంగారరస ప్రధానములైన కాంతాలంబనాలైన కావ్యాలను చదివిన సరసహృదయుడు.

ఇది శాస్త్ర సమ్మతము, ఇదికాదూ అని తెలిసిన విద్వాంసుడు.

ఇల్లాంటివాడు శృంగార లీలల్లో శాస్త్ర మర్యాదలను అతిక్రమిస్తున్నాడూ అంటే ఎంత శోచనీయమో నేను వేరే చెప్పనక్కరలేదు.

శర్మ కావ్యాలను ఎక్కువగా చదవటం చేతనే అతనికి మతి చెడిందని నా అభిప్రాయం.

అయితే శర్మ బొత్తిగా పిచ్చివాడై పోయినాడనీ నేను అనటం లేదు. అన్ని లౌకిక వ్యవహారాలలోనూ అతడు తెలివిగానే ప్రవర్తిస్తున్నాడు. భార్య విషయంలోనే అతని ప్రవర్తన ఈ అనుమానానికి ఆస్పదం అవుతూ ఉన్నది.

ఈ విపరీత అనన్య సామాన్య ప్రవర్తనను ప్రణయ పూరితమైన అతని హృదయంలో కలిగిన స్పందనానికి ఫలితము అనీ, కళాప్రసక్తమైన రసవద్వినోద ప్రదర్శనమనీ అనేవాళ్ళూ ఉన్నారు. అయినా పండితుడు అయి ఉండి అశాస్త్రీయంగా

ప్రవర్తిస్తే ఎవ్వరూ ఊరుకోరు.

శర్మ మొదటినుంచీ ఇల్లాంటివాడే అయి ఉన్నట్లయితే నేను ఇంతగా విచారపడేవాణ్ణి కాదు. మొదట్లో శర్మ నిక్షేపం లాంటి బిడ్డ. వజ్రపు తునక. శాస్త్ర మర్యాదను ఎప్పుడూ అతిక్రమించి ఎరగడు.

జానకి వంటయింట్లో పనిచేసుకొంటూ ఉంటే తాను ముందు గదిలో కూర్చొని పద్యరచన చేస్తూ ఉండేవాడు. పట్టపగలు వంట ఇంట్లోకి వెళ్ళి భార్యను పలకరించటం శాస్త్ర సమ్మతం కాదు. భార్య అసమాన సౌందర్య విభాసిని కావచ్చు. చతురవచఃకౌశలము కలిగినది కావచ్చు. ఆమె సామీప్యము నిరవధిక ఆనందదాయి కావచ్చు. కాని పగలే వెళ్ళి ఆమెతో మాట్లాడటం అనేది అనివార్య సాంప్రదాయమనీ, అల్లాంటి చేష్టకు అనౌచిత్య దోషం పడుతుందనీ శర్మ బాగా గుర్తెరిగినవాడు.

ఇల్లాంటి శర్మ ఇప్పుడు ఎల్లాగ తయారైనాడో చూడండి. మతి తిరిగిపోయింది కర్మం!

ఇప్పుడు శర్మ ఆ వంటఇల్లు వదలకుండా ఉంటున్నాడు. ఆ పిల్ల కొంగుపట్టుకుని వేలాడుతాడు!

అయ్యయ్యో! ఎక్కడైనా ఉందా ఇంత అన్యాయం!

శర్మ తన గదిలో తాను కూర్చుని తన చదువు చదువుకోడుగద! పుస్తకాలు తీసుకెళ్ళి ఆ అమ్మాయికి ఎదురుగా కూర్చుంటాడు. అక్కడే తనకు చదువు బాగా సాగుతుందట! ఎక్కడైనా ఉందా ఈ అన్యాయం.

సౌందర్య సౌభాగ్యాలను భోగించవలసింది సాహిత్యంలో కాని కాంతా సన్నిధానంలో కాదే! కాంతాలంబనాలైన కావ్యాలపట్ల అనురక్తి ఉన్నా కాంతలపట్ల విరక్తి ఉండాలనే గదా శాస్త్రప్రవచనము. అలాంటప్పుడు శర్మ చేస్తూ ఉన్న పని ఎట్లా శాస్త్రసమ్మతమైనదీ అని నా ప్రశ్న.

ఆ శర్మ అక్కడ కూర్చుని పోనీ ఏమైనా చదువుతున్నాడా, అదీలేదు.

ఎంతసేపటికీ శర్మ ఆ అమ్మాయి ముఖంవంక చూస్తుంటాడే గాని పుస్తకాలవంక చూచిన పాపాన పోడే!

ఊరికే ఆ పిల్లను ఇటునుంచీ అటునుంచీ, దగ్గరనుంచీ దూరాన్నుంచి చూస్తూ ఉండటం ఏం చదువూ అని నా ప్రశ్న!

మహాభోగి, రసికప్రభువు, సౌందర్యార్చకుడు అయిన పండితరాజు కూడా ఇల్లాగ లవంగి సన్నిధానంలో శాస్త్రపఠనం చేసినాడని ఎవరూ చెప్పలేదు. ఇది శర్మకు ఎత్తిన పిచ్చేగాని మరియొకటి గాదు.

భార్యను ప్రేమించే వాళ్ళను నేను చాలామందిని చూశాను. నేనుమట్టుకు ఎరగను గనకనా భార్యను ప్రేమించటం అంటే ఏమిటో! కాని ఇంత అన్యాయం ఎక్కడా చూడలేదు. పసిపిల్లవాడు తల్లికొంగు పట్టుకొని తిరిగేలాగున శర్మ కొంగు పట్టుకొని తిరుగుతున్నాడు. ఇది ఎంత అశాస్త్రీయమైన పనో అతడు తెలుసుకోక పోవటమే చాలా విచారకరమైన విషయము.

అల్లాగ చూస్తూ ఊరుకొన్నా కొంత నయమే. ఇంకా విచిత్రమైన పనులు చేస్తున్నాడు కాబట్టే నేను మాట్లాడవలసి వచ్చింది. లేకపోతే నేను ఈ విషయమై పట్టించుకొనేవాణ్ణి కాదు.

శాస్త్ర నియమాలకు బెత్తెడు అటూ ఇటూ పోతూ ఉంటే అంత అనుకోవలసింది ఏమీ ఉండదు కాని ఆ మర్యాదలను బొత్తిగా మంట కలిపేస్తూ ఉంటేనే ఎవరికైనా చిరాకుగా ఉంటుంది.

ఇప్పుడు చూడండి మాటవరుసకు చెపుతాను. శర్మ ఆ జానకి ఎదురుగా కూర్చున్నాడా, కూర్చున్నవాడు అల్లాగ బుద్ధిగలిగి కూర్చుంటే ఎవ్వరేమంటారు. ఏదో ఒక పిచ్చిపని చేస్తూ ఉండె!

ఏమైందీ అంటే,

జానకీశర్మా ఒకరికి ఎదురుగా ఒకరు కూర్చున్నారు. శర్మ ఊరికే చూస్తున్నాడు. "ఇంట్లో ఉండేదాన్నే అయితిని. రోజూ కనపడే మనిషినే అయితిని. నన్ను ఊరికే ఇల్లా చూస్తాడేం ఈ అబ్బాయి" అని అనుకొన్నదో ఏమో ఆ పిల్ల ఇటు తిరిగి ఉన్నదల్లా గిరుక్కున అటు తిరిగింది.

తిరిగితే తనకొచ్చిన నష్టం ఏముంది! శర్మ ఊరుకోకూడదూ!

ఊరుకోక శర్మ 'ఏయ్, జానకీ' అని పిలిచాడు. ఆ పిల్ల పలకలేదు. పలక్కపోతే పోనీలే అని ఊరుకోవాలా లేకపోతే, "ఏయ్ ఏయ్ నిన్నే జానకీ ఏయ్ ఏయ్, ఏయ్ జానకీ ఏయ్, అంటూ విసుగులేకుండా పిలవాలా? తాను అన్నిసార్లు పిలిచినా ఆ పిల్ల పలకలేదన్న కోపం కూడా లేదు శర్మకు. అదీ విచిత్రం.

అంత చదువు చదువుకొన్న పండితుడే తను, తనను, ఒక పిల్ల, అజ్ఞానురాలైన పిల్ల, తృణీకరిస్తూ ఉంటే ఎందుకు కోపంరాదో నాకు అర్థం కావటం లేదు. చదువు కొన్నందుకు తన సంగతి తాను కాస్త తెలుసుకోవాలె. తన గౌరవం తాను నిలుపుకోవాలె. "ఏయ్ జానకీ ఇటు తిరుగు, నిన్నే ఏయ్, జానకీ" ఏయ్ జానకీ అని ఒకటే పిలవటమా! దానికేమైనా అంతు ఉండవద్దూ!

జానకి భలే పనిచేసింది. నిజంగా ఆ అమ్మాయే నయం. కాస్త ఆత్మాభిమానం మర్యాద తెలిసిన పిల్ల! ఎన్ని పిలచినా ఆఁ అనలేదు ఊఁ అనలేదు.

ఇల్లా జరిగిందే అని నాకే ఎంతో కష్టంగా ఉందే శర్మకు ఎల్లా ఉండాలె! నిజానికి, అవమానంతో కృంగి కృశించి పోవాలిసిన పనిగదా, శర్మ ఏ ముఖం పెట్టుకొని అల్లాగ ఇంకా ఆ పిల్లను పిలుస్తాడో నాకు అర్థం కావటంలేదు.

ఆ పిల్ల శర్మవంక కన్నెత్తి అయినా చూడలేదు, అతని వైపుకు తిరగనూలేదు. అటే తిరిగి ఏదో కూర తరుక్కుంటూ వున్నది.

ఇది చాలా తమాషా అయిన సన్నివేశము మటుకు అవును. శర్మకు ఏం చేయాలిసింది తోచలేదు. తోచకపోవటంతో వైపరీత్యమూ లేదు. శర్మ కళ్ళుమూసుకొని కణతలు నొక్కుకుంటూ కాసేపు ఆలోచించాడు.

ఎట్లాగయినా కాస్త చదువుకొన్న వాడు అయిన కారణంచేత శర్మకు శృంగార రసవత్కావ్యాలలో నుంచి ఒక శ్లోకం జ్ఞాపకానికి వచ్చింది.

గురుమధ్య గతామయా నతాంగీ
నిహతా నీరజకోరకేణ మందం
దరకుండల తాండవం నతభ్రూ
లతికం మామవలోక్య మూర్ఛితాసీత్

అని!

శర్మ సంతోషంతో ఎగరటం మొదలుపెట్టాడు. అతడు ఆలోచిస్తూ ఉన్న సమస్యకు సమాధానం దొరికింది ఈ శ్లోకంలో.

గురుజనులమధ్య ఉన్న ప్రియురాలును కమల ముకుళముతో ప్రియుడు, కొట్టగా ఆమె కుండలాలు కదులులాగున వంగి ప్రియుణ్ణి తొట్రపాటుతో చూచిందిట! కాబట్టి ఇప్పుడు చేయవలసింది ఏమిటి అంటే ఆ పిల్లను నీరజ కోరకంతో కొట్టటమే!

శర్మ ఆపళంగా తన కర్తవ్యమును నిర్ణయించుకొన్న వాడై తన సమీపంలో నీరజ కోరికము లేకపోవటంచేత దొరికిన తోటకూర కాడ ఒకటిని తీసుకొని ఆమెపై విసిరాడు.

తాను కష్టించి చదివిన శృంగార సాహిత్యమూ జీర్ణించుకొన్న పరిపుల్ల భావనా సౌభాగ్యమూ ఈనాటికి ఈ విధంగా సౌందర్యార్చనకై తోడ్పడ్డవి.

అప్పటికీ కూడా జానకి మాట్లాడక పోయేటప్పటికి శర్మ దొరికిందల్లా తీసికొని కొట్టాడు. అరటికాయ చెక్కులూ, మిరపకాయ తొడిమలూ, కూరముక్కలు మొదలైనవి అన్నీ ఆమెపైన విసరడం సాగించినాడు.

ఇక్కడ ఒక్క క్షణం ఆగి శర్మను కాస్త విమర్శించాలె. ఏది కనపడితే అది తీసుకొని ఆ అమాయకురాలిపై విసరటమేనా అని! ఇవ్వాళ తోటకూర కాడ అయింది, రేపు ఇంకొకటి అయినా ఇంతేగద! ఇందుకనే నేను గోలపెడుతూ ఉన్నది. శృంగార విషయాలలో శర్మ నవ్యసిద్ధాంత ప్రతిపాదనా అభినవ రచనా శాస్త్ర మర్యాదలను అతిక్రమిస్తూ ఉన్నాడూ అని!

జానకి అప్పుడు ఏం జేయాలిసిందీ అంటే కొద్దిగా వంగి కుండలాలు కదిలేలాగున తొట్రుపాటుతో ప్రియుణ్ణి ఓరగంటితో చూడవలసింది. ఆ పిల్ల ఏమీ ఎరుగనట్టు ఊరుకొన్నదేగాని ప్రకరణంలో ఉన్నట్లు చేయలేదు. దాంతో శాస్త్రమర్యాద మళ్ళీ తప్పింది, ఇల్లాగ ప్రతి విషయమూ అశాస్త్రీయ కల్పం అయిపోయింది.

ఇంతటితో ఈ వ్యవహారం ఆగిపోయినా బాగుండేది! కాని ఆగిపోక ఇంకా చాలాదాకా పోయింది.

ఏమైందీ అంటే, ఆ పిల్ల నవ్వకపోయేసరికి శర్మ కాస్త తెలిసినవాడు కాబట్టీ శాస్త్రమునందు ప్రమాణబుద్ధి కలవాడు కాబట్టీ ఏం జేశాడూ అంటే ఆమెను కొద్దిగా నవ్వించి శాస్త్ర మర్యాదను కాపాడదామూ అనే ఉద్దేశంతో మెల్లగా ఆమెను సమీపించాడు.

శర్మ రాకను జానకి చూడలేదు. అటు తిరిగి ఉన్నది కాబట్టి. ఇటు తిరిగి ఉన్నట్లయితే వ్యవహారం బొత్తిగా చెడిపోయేది. అటు తిరిగి ఉండటమే నయమైంది.

శర్మ అల్లాగ సమీపించి ఆ పిల్ల వీపుపైగా వంగి తన రెండు చేతులతో సహా ఆముగ్ధ యొక్క నయనాలను గట్టిగా మూశాడు. ఆ పిల్ల కళ్ళు ఎంతో అందంగా ఉంటవి. రమణీయమైన ఆకారం గలిగి తళుక్కు తళుక్కుమని మెరుస్తూ ఉంటవి.

అల్లాంటి సౌందర్య సౌభాగ్యాన్ని చూచి ఆనందించాలె గాని అరచేతులతో మరుగుపరచటం కాంతా సమ్మితమూ కాదు, శాస్త్ర సమ్మతమూ కాదు.

అసలు ఆ కళ్ళు మూయటానికి తగినంత కారణం కూడా కనిపించదు. ఆ పిల్ల శర్మకు అభిముఖంగా ఉన్నట్లయితే 'అదిగో, నా వంక ఊరికే కళ్ళు పెట్టుకు చూస్తున్నది. అందుకనే నేను మూశాను' అని అన్నా అనవచ్చు. కాని జానకి మరొక దిక్కుకు చూస్తూ ఉండటం మూలాన, శర్మ అలాగ ఆ పిల్లయొక్క శృంగార సుస్నిగ్ధములైన కపోలపాళిని కమనీయమైన నేత్ర ద్వయాన్ని మూయటం శుద్ధ తెలివితక్కువ పని అయింది. అనవసరమూ వ్యర్థమూ కూడా అయింది.

ఆ కళ్ళ విషయమై ఒక పూర్వగాథ కూడా ఉన్నది. జానకి కార్యం నాడే ఈ కళ్ళ విషయమై కొంచెం చర్చ జరిగింది.

ఏమిటీ అంటే, ఆ రోజున ఆ అమ్మాయికి అలంకారం చేస్తూ కళ్ళనిండా కాటుక పెట్టేటప్పుడు "దీనికింత పెద్ద కళ్ళు ఉన్నవేవమ్మా. ఎందుకబ్బా, భగవంతుడు దీనికి ఇంతలేసి కళ్లు పెట్టాడూ!" అని ఒకావిడ అన్నది.

ఆ తరువాత ఆ పిల్లకు కళ్ళు అంత విశాలమైనవిగా ఎందుకు ఏర్పడ్డవి అన్న విషయంపై చాలాసేపు చర్చ జరిగింది. చివరకు మొగుణ్ణి బాగా చూసేందుకే ఆ రెండు కళ్ళూ అంత పెద్దవిగా ఏర్పడి వున్నవి అని తేలింది. కాని ఒక సందేహం కూడా కలిగింది కొందరికి. ఇంతలేసి కళ్ళతో చూస్తేనేగాని కనపడడా ఏమిటి ఆ మొగుడూ అని!

చివరకు అంతా ఒక మాట అన్నారు. కళ్ళు అంత పెద్దవిగా ఉన్నప్పుడు జానకి మొగుణ్ణి రెండు కళ్ళతోనూ చూడనక్కరలేదనీ ఒక్క కన్నుతో చూస్తే చాలుననీ!

తదారభ్య జానకి 'అయనను చూడటానికి ఈ రెండు కళ్ళూ చాలవమ్మా' అని అంటూ ఉన్నా సాధారణంగా ఒక కంటితోనే చూస్తూ, అంటే ఒక కన్ను మూసి ఒక కంటితోనే చూస్తూ, ఉండేది! శర్మకు ఈ విషయం అంతా తెలుసు.

జానకి విశాల నయనాల యొక్క ప్రాశస్త్యము తెలిసి కూడా, ఇల్లాగ తన చేతులతో తాను ఆమె కళ్ళు మూయటం అనేది సరసహృదయుడు చేయవలసిన పనికాదు. కాని శర్మ ఇల్లాంటి పనులు చేసి శాస్త్రాన్ని తగలేస్తున్నాడు.

అయితే,

శర్మ స్వర్గసౌఖ్యాన్ని అభిలషించి ఆమె కళ్ళు మూశాడూ అంటారు కొందరు! అది ఒప్పుకోవలసిన విషయం కాదు. ఎందుకూ అంటే, స్పర్శకు కళ్లే కావలసివచ్చినవా? క్షీరసాగరంలోని బుద్బుదములలాగ ప్రకాశిస్తూ ఉన్న ఆమె వక్షమూ, స్నిగ్ధములైన ఆమె కపోలపాళి, అరుణరాగ యుక్తమైన ఆమె అధరమూ మొదలైన సౌందర్య సీమలు ఎన్ని లేవు!

ఆమె తనువు బంగారపు పొలము. ఎక్కడ ముట్టుకొన్నా బంగారమే కదా! అల్లాంటప్పుడు శర్మ ఆ నయన ద్వయాన్నే తాకటం ఏమీ అని నా ప్రశ్న!

ఎందుకైనా కానీయండి శర్మ మటుకు ఆ పిల్ల కళ్ళు గట్టిగా మూసిన మాట నిజం. ఇంక ఏమనుకుంటే ఏమిలాభం!

శర్మ చేసిన పని మంచిదని పెద్దలూ, తెలిసిన వాళ్ళూ ఎవరూ అనరుగదా! గులాబీ రేకులవలె ఉన్న ఆమె కనురెప్పలనూ, వానిక్రింద విచ్చిన బొడ్డుమల్లెపూలలాగు ఉన్న ఆమెకన్నులనూ, వాని సమీపభూమిలో అటూ ఇటూ ఉన్న మృదువైన నయనసీమనూ అల్లాగ తన చేతులతో నొక్కటం అనేది కేవలం దారుణమైన పనిమటుకు అవును. ఇది శాస్త్రసమ్మతము కాదనీ, అనుపూర్విక విద్వత్సాంప్రదాయము కూడా కాదనీ, నేను గట్టిగా చెప్పగలను. వాత్స్యాయనుడు కూడా ఇల్లాగ చేయటం కామక్రీడ అని ఎక్కడా చెప్పినట్టు లేదు.

ఇల్లాగ కళ్ళుమూసి నొక్కటం వల్ల పాపం జానకి ఎంత హడలిపోయిందో తెలుసుకొన్న వాళ్ళు కూడా లేకపోవటం చాలా విచారకరమైన విషయముకదా!

శర్మ సరసహృదయుడైతే ఆ పిల్ల "అబ్బ! ఏమిటండీ, అది!" అని అన్నప్పుడైనా కాస్త జాలిని పొంది ఉండాలిసింది. శర్మ ఏమాత్రమూ జాలి చూపలేదు. పైగా అంటాడూ

దయితా దయితాన నాంబుజం

దరమీల న్నయనా నిరీక్షతే

అని!

ఆ అమ్మాయి మీలనము పొందుతూ ఉన్న నయనాలు కలదై, ప్రియుని ముఖాంబుజమును చూస్తూ ఉన్నదట! అందుకనే తాను ఆమె కళ్ళు మూశాడట!

ఈ నిమీలిత నేత్రాలు ఆమెగారి చుంబనేచ్ఛను అభివ్యక్తం చేస్తున్నాయట! ఆ పని జరగకుండా ఉండటానికి అతను కళ్ళు మూశాడట!

అల్లా కళ్ళు మూయటం తప్పు అని శర్మ అంగీకరించడు. పెద్ద పెద్ద మాటలు ఉపయోగించి శ్లోకాలు చదివి తాను మర్యాదతప్పి ప్రవర్తించటము లేదు. అని వాదిస్తాడు.

ఆమె సిగ్గుతో తల వంచుకొన్నదట! ఆ దరమిలాన్నయనత్వములో తన ముఖాంబుజమును ముద్దుపెట్టుకోవలెననే కాంక్ష వ్యక్తము అయిందట! కొంచెము కొంచెము కనుమూతలలో ఆమె తనను ఉత్కంఠతతో చూస్తున్నదీ అంటాడు.

ఆ పిల్ల చూపులకు అల్లాంటి విపరీతమైన అర్థాలు కల్పించటమే అతడు పిచ్చివాడై పోయినాడు అని అంటానికి ప్రబల నిదర్శనము.

శర్మను ఇంకా కదిలిస్తే ఆ పిల్ల నయనాలలోని దరనిమీలనము త్రపాకార్యమనీ, స్థాయీ భావమనీ ఇంకా ఏవేవో విభావ అనుభావ సంచారీ భావాలనీ అంటాడు. మనకు కూడా పిచ్చెక్కుతుంది. అందుకని ఆ విషయం వదిలేస్తున్నాను.

వదిలేసి ఆ పిల్ల కళ్ళను శర్మ అల్లాగ మూసిన తరువాత ఏమి జరిగిందీ అన్న

విషయానికి వస్తాను.

శర్మ ఇల్లాగ తన కళ్ళను మూయటం జానకికి ఏమాత్రమూ ఇష్టంలేదు. అల్లాంటప్పుడు ఆ పిల్ల శర్మను గట్టిగా కోప్పడి ఉండవలసింది. ఏ కారణంచేతనో ఏమో ఆ పిల్ల మొగుణ్ణి కోప్పడి ఉండలేదు. అసలు కోప్పడాలని తెలియదు, సంస్కృతం చదవుకొన్నదా ఏమన్నానా? పిల్లలకు సంస్కృతం చెప్పించాలని పెద్దవాళ్ళు గోలపెట్టటానికి కూడా ఇదే కారణం, కాస్త మంచీ చెడ్డ తెలుస్తుందనేగా!

ఆ పిల్ల మొగుణ్ణి కోప్పడక ఊరుకొనటం పెద్ద పొరపాటు అయింది.

ఊరుకొనేటప్పటికి ఆమె కళ్ళపై నున్న శర్మ రెండు చేతులుకూడా హఠాత్తుగా జారి ఆమె వక్షస్థలంపై పడిపోయినవి.

పిల్లలు ఇద్దరూ కూడా హడలిపోయినారు. జానకి శరీరం అంతా పులకలు తేలింది. శర్మ శరీరం గాలిలో తేలిపోయింది.

జానకి ఇల్లాంటి సంఘటన ఎప్పుడూ ఊహించలేదు. ఆమె ముగ్ధ కావటంచేతా, ప్రౌఢచేసే శృంగార చేష్టలతో పరిచయం లేకపోవటముచేతా నిర్ఘాంతపోయి ఊరుకొన్నదే కాని ఏ విధమైన విలాసక్రీడా జరుపలేదు.

శర్మకూ తెలియదు ఇల్లాంటి విషమపరిస్థితి వస్తుందని! కళ్ళు మూసే ప్రకరణం ఇల్లాగ తేలుతుందని అతనూ ఎక్కడా చదివియుండలేదు. కళ్ళు మూద్దామనే యోచించాడు గాని తన చేతులు స్థానచ్యుతిని పొంది ఇల్లాగ నిమ్నోన్నత సీమలపై సంచారం చేస్తవి అని అతడూ అనుకోలేదు.

ఆ ముగ్ధ బాలిక, నవ వధూ జాతికి సహజంగా కలిగే తన్మయత్వంలో ఉండిపోయింది. అల్లా ఉండిపోవటంలోనే ప్రకరణం తప్పిపోయింది.

అయితే శాస్త్రరీత్యా ఏమిజరగవలసింది! అల్లాంటి అవస్థలో పడ్డ ఒక నాయిక ఏం జేసిందీ....?

'హృదయగతం ప్రియపాణిం మందమాక్షీపతి' అని గదా! అంటే, హృదయగతం అనగా వక్షోభాగాన ఉన్న ప్రియుని హస్తాన్ని మెల్లగా తీసివేస్తున్నదట! శాస్త్ర రీత్యా జరగవలసిన పని అది! అల్లాగ జరిగినట్లయితే ప్రకరణం క్రమము తప్పేది కాదు.

కాని జానకి తన్మయత్వంలో ఉండిపోయి అతని కర పల్లవాలను మెల్లగా త్రోసివేయటం మరచిపోయింది. మరిచిపోయి ఆ లజ్జాపిహిత తన్వి, ప్రసన్న వదనంతో చిరునగవుల ముత్యాలు వలకబోస్తూ అమాయకంగా చూస్తూ ఉండిపోయింది.

ఉండిపోయేటప్పటికి శ్లోకంలో చెప్పినట్లు జరగక క్రమం తప్పిందా లేదా, అదీ నా గోల!!

ఇంకా ఎందుకు చర్చ! క్రమం తప్పిన మాట మాత్రము నిజం! దీనికెవరు బాధ్యులు అంటే, శర్మే!

ఎందుకంటే,

ఆ పిల్లకు ఏమీ తెలియదు. సంస్కృతం చదువుకోలేదు. మరి శర్మే ఆ విషయం అంతా చూచుకొని తాను చేస్తూ ఉన్నపని, జరుగుతూ ఉన్న వృత్తాంతము సరిగ్గా ఉన్నదా లేదా అని చూచుకోవలసినది. అతడు అల్లాగ చేయకపోవటంచేత ఈ శృంగారకాండ అంతా క్రమంతప్పి అశాస్త్రీయ కామకలాపం అయింది!

సామాన్యులైన భార్యాభర్తలు ఇల్లాగ ప్రవర్తించారూ అంటే అంతగా అనుకోవలసింది ఏమీ లేదు. కాని పండితుడైన శర్మ ఇల్లాగ అశాస్త్రీయంగా ప్రవర్తించటం మహాదోషయుక్త మైన విషయము అంటాను. అట్టి ప్రవర్తనను నేను ఏమాత్రమూ ఒప్పుకోను.

నువ్వు ఒప్పుకొనేది ఏమిటి, అల్లాంటి ప్రవర్తనను అనుభవించే జానకే ఒప్పుకొన్నప్పుడూ అని ఎవరైనా అనవచ్చు! జానకి ఏమీ తెలియని అజ్ఞానురాలు. అందుచేత అతని ప్రవర్తనను హర్షించవచ్చు. నేను మాత్రము శర్మ అధర్మ ప్రవర్తనను ఖండిస్తున్నాను.

శర్మ వంటి మహాపండితుడే శాస్త్ర మర్యాదలను ఆచరించలేక తల్లక్రిందులై పోయినాడు కాబట్టి, సామాన్యులు ఇల్లాంటి సందర్భాలలో క్రమం తప్పకుండా ఉండాలంటే ప్రకరణం అంతా ముందుగా వ్రాసి పెట్టుకొని ఉంచుకోటం మంచిదీ అని కూడా నేను చెపుతున్నాను.

(మే, 1955)